సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఉపశమనం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతోందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులు ఆర్థిక సహాయం కోసం మధుయాష్కీగౌడ్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయించి చెక్కులను ఆదివారం వనస్థలిపురంలోని కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, రవీందర్‌గౌడ్, అశోక్‌గౌడ్, రామారావు, రాజశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, శరత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కార్యక్రమంలో అహోబిలం రామానుజ జీయర్ స్వామి, ఎన్ రాంచందర్‌రావు తదితరులు

మన్సూరాబాద్: శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సహాయం శనివారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి అహోబిల రామానుజ జీయర్ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాచందర్ రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ వేదాల శ్రీనివాస్, కండ్లకుంట కమల, మరింగంటి కులశేఖరచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నాగోలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగోలు శాఖ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. నాగోలు ప్రాంతంలో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు సమావేశాలు, ఇతర అవసరాలకు భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాగోలు శాఖ అధ్యక్షులు బి.వి. ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి అశోక్ కుమార్ రావు, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ లాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



ఉప్పల్: మతిస్థిమితం సరిగ్గా లేని బాలిక అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4న చోటు చేసుకుంది. బచ్చన్నపేట మండలం సాలపల్లి గ్రామానికి చెందిన రేణుక కుమార్తెకు మతిస్థిమితం సరిగ్గా లేదు. చికిత్స కోసం 1న ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. 3 రోజుల చికిత్స అనంతరం తిరుగు ప్రయాణంలో 4న ఉస్మానియా నుంచి బస్సులో ఉప్పల్ వరంగల్ బస్టాప్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో బస్సుకోసం తల్లి రేణుకా డ్రైవర్‌ను ఆరా తీస్తుండగా.. అంతలోనే బాలిక కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం బాలిక తల్లి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దసరా ఉత్సవ నూతన కమిటీ

రామంతాపూర్ : ప్రధాన రహదారిలో విజయదశమి రోజున నిర్వహించే రావణ సంహార మేళా దసరా ఉత్సవాల కమిటీని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ఆదివారం నియమించారు. కమిటీ చైర్మన్‌గా బుర్ర రాజేశ్వర్, అధ్యక్షులుగా వల్లపు జగన్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణగౌడ్, సభ్యులుగా రేవు నరసింహా, సంతోష్ గుప్తా, వెంకటేష్, రవీందర్, శ్రీనివాస్, ఉపేందర్, ముత్యం దర్శనాల సుధాకర్, శైలేందర్, మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

అవినీతికి అంతే లేదా?

పనులు చేయకుండానే బిల్లులు కాజేస్తున్న వైనం

ఆర్టీఐ ద్వారా వెలికి తీసిన ఐఎస్‌సదన్ కార్పొరేటర్

సైదాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు అధికారికంగా చేయాల్సిన పనికి లంచం తీసుకోవడం అవినీతి. అలాంటి అవినీతికి పాల్పడే అధికారులను బాధితులు అవినీతి నిరోధక శాఖకు పట్టించవచ్చు. మరి జీహెచ్‌ఎంసీ నిధులను పనులు చేయకుండానే బిల్లుల పేరుతో దోపిడీ చేస్తున్న అధికారులు, కాంట్రాక్టర్లను ఎవరు ఎలా పట్టుకోవాలి. వారిపై చర్యలు ఉండవా అంటే సమాధానం చెప్పే వారు కరువవుతున్నారు. సాక్షాత్తు డివిజన్ కార్పొరేటరే ఆర్టీఐ ద్వారా సమాచారం పొంది తన డివిజన్‌లో సర్కిల్ స్థాయి అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడి కావటం లేదు. గతంలోనూ రహదారి వేయకుండానే కాంట్రాక్టు, అధికారులు రూ. 10 లక్షల నిధులు మాయం చేశారన్న కార్పొరేటర్ ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొన్నారు. అయితే నిధులు తిరిగి రాబట్టారా, సదరు కాంట్రాక్టర్‌పై ఏమైనా చర్యలు తీసుకున్నారా అనే ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఎవరూ చెప్పని పరిస్థితి నెలకొంది.



సుబ్రమణ్యనగర్ మోడల్ మార్కెట్ వద్ద బాక్స్‌డ్రైయిన్ వేయాల్సిన ప్రాంతం

రూ. 51 లక్షలు స్వాహా ..!

సంతోష్‌నగర్ సర్కిల్ ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో మూడు చోట్ల వివిధ అభివృద్ధి పనులు అసలు ఏమాత్రం చేయకుండానే సర్కిల్ అధికారులు, కాంట్రాక్టర్లతో అంటకాగి రూ. 51 లక్షలను తమ జేబుల్లోకి మళ్లించుకున్నారు. ఇది కేవలం ఆరోపణలు కాదు. పూర్తి స్థాయి వివరాలతో ఆర్టీఐ ద్వారా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల నుంచి పొందిన సమాచారంతో కార్పొరేటర్ వెలుగులోకి తెచ్చిన



డీఎస్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించామని బిల్లులు పొందిన ప్రాంతం

ఉందతమిది. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని డీఎస్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ వద్ద రూపాయి పని చేయకుండానే పనులు పూర్తి అయినట్లు రూ. 10.50 లక్షల బిల్లు, అదే బస్తీలో పబ్లిక్ టాయిలెట్లు కూల్చి మరో కమ్యూనిటీ హాల్ నిర్మించారని రూ. 18.80 లక్షల బిల్లు, సుబ్రమణ్యనగర్ కాలనీ మోడల్ మార్కెట్ ఎదురుగా బాక్స్ డ్రెయిన్ నిర్మించారని రూ. 22 లక్షల బిల్లులను అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి స్వాహా చేసారు.

అవినీతికి అడ్డాగా ఐఎస్‌సదన్ డివిజన్...

జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఐఎస్‌సదన్ డివిజన్ అధికారుల అవినీతికి అడ్డాగా మారింది. కాంట్రాక్టర్లను తమకు అనుకూలంగా మార్చుకొని విలువైన ప్రజాధనంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారు తమకు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గతంలో అభివృద్ధి పనుల వద్ద అధికారులు కమీషన్లు తీసుకుంటారనే ఆరోపణలు వచ్చేయి. అలాంటిది ఇప్పుడు ఎలాంటి పనులు చేయకుండానే బిల్లులు దండుకోవటం వారికి పరిపాటిగా మారింది. డివిజన్ పరిధిలో ముఖ్యంగా బస్తీలలోనే ఈ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గతంలో నిరుపేదలు నివసించే సింగరేణి కాలనీలో, ఇప్పుడు కూడా డీఎస్‌నగర్‌లోనే ఈ అవినీతి ఉదంతాలు బయటకు వచ్చాయి. నిరుపేదలు, నిరక్షరాసులకు తమ ప్రాంతంలో జరిగే, జరగాల్సిన అభివృద్ధి పనుల విషయమై అవగాహన లేకపోవడాన్ని అవినీతిపరులు ఆసరాగా చేసుకుంటున్నారని తెలుస్తోంది.

కఠిన చర్యలు తీసుకోవాలి



తప్పులు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే మరొకరు అలాంటి తప్పులు పునరావృతం చేయకుండా ఉంటారు. ఐఎస్‌సదన్ డివిజన్‌లో పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న ఘటనలో సంబంధం ఉన్న అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని వారి నుండి బిల్లుల సొమ్మును రికవరీ చేయాలి. ఐఎస్‌సదన్‌లోని పలు బస్తీలలో ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనులు అన్నింటిపై విచారణ జరిపిస్తే అవినీతిపరుల గుట్టు బయటకు వస్తుంది.

–జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ కార్పొరేటర్

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.17, వంకాయ రూ.23, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.19, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.75, కంద గడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.57. ఈరోజు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మ్యాన్‌హోల్ పనుల పరిశీలన



కుంగిన మ్యాన్‌హోల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని ఆర్టీసీకాలనీలో కుంగిన డ్రైనేజీ మ్యాన్‌హోల్ పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ వ్యర్థాలతో నిండిపోయాయన్నారు. మ్యాన్‌హోల్స్ నిండిపోవటంతో డ్రైనేజీలు పొంగిపోయి మురుగు రోడ్లపై పారుతుందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, రాజేందర్‌బాబు, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటం



సమావేశంలో పాల్గొన్న ఐక్యవేదిక ప్రతినిధులు

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ పరిధిలోని కాలనీలలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడుతామని ఏపీఏయూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఏపీఏయూ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో విజయ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని 18 కాలనీల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 కాలనీల సంఘాలతో కలిపి నూతనంగా సైదాబాద్ ఐక్యవేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. ఐక్యవేదికకు కళ్యాణ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు గోవిందరాజు కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. సైదాబాద్ డివిజన్‌లో 50, 60 సంవత్సరాల క్రితం ఏర్పడిన పలు కాలనీల్లో ఇప్పటికీ పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని ఆయన వివరించారు. వెంకటాద్రి నగర్, రెవెన్యూ బోర్డ్ కాలనీల్లో పలు ప్లాట్లను ప్రభుత్వాలు రెగ్యులరైజ్ చేయక పోవటంతో యజమానులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంకటాద్రి నగర్, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, ఏపీఏయూ కాలనీల్లో ఇప్పటికీ వర్షాలు కురుస్తే వరద ముంపుతో ఇక్కట్లు పడుతున్నామని అన్నారు. అన్ని కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల సమస్యలు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నా ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి ఇక నుంచి సమిష్టిగా కృషి చేస్తామని ఆయన అన్నారు. సమావేశంలో శ్రీనివాస్, లక్ష్మణ్ ఠాకూర్, సురేందర్‌రెడ్డి, భక్తవత్సలం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నాగోలు : సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ నాగేశ్వర్ రావు కాలనీకి చెందిన భాస్కర్ రావు అనారోగ్య సమస్యలతో ఇటీవల ఆస్పత్రిలో చేరారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అతని ఆపరేషన్‌కు కావాల్సిన రూ. 2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు కార్యక్రమంలో నాయకులు ప్రతీక్, సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూపతి సురేష్ మరణం పార్టీకి తీరని లోటు



సురేష్ సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజీజ్ పాషా

నాగోలు: సీపీఐ నాయకులు భూపతి సురేష్ మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ నాయకులు అజీజ్ పాషా అన్నారు. ఆదివారం నాగోలు జైపురి కాలనీలో భూపతి సురేష్ సంతాప సభలో పాల్గొన్న ఆయన పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైపురి కాలనీలో పట్టాల పంపిణీ నుంచి, శాశ్వత ఇళ్ల నిర్మాణం వరకు జరిగిన అనేక పోరాటాల్లో సురేష్ ముందున్నాడని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పట్ల నిరంతరం పనిచేసేవాడని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, శ్యామల యాదగిరి, బీఆర్‌ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదు



కార్యక్రమంలో పాల్గొన్న అజీజ్‌పాషా తదితర నాయకులు

సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

మన్సూరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని మన్సూరాబాద్ చౌరస్తాలో ఆదివారం జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తికి నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే అన్నారు. నిజాం క్రూరత్వానికి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్ల గుండెల్లో దడ పుట్టించింది కమ్యూనిస్ట్ పార్టీయని తెలిపారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారింగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీంద్రాచారి, సామిడి శేఖర్‌రెడ్డి, సుధాకర్, శేషరాజుపల్లి శ్రీదేవి, రాములుగౌడ్, అరుణ్‌కుమార్‌గౌడ్, మర్రి శోభన్, కర్నె సుజాత తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలి

గన్‌ఫౌండ్రీ: చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కూచిపూడి కళాక్షేత్రం 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాగంటి వసుధ కళాక్షేత్రాన్ని స్థాపించి అనేక మంది కళాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామ్‌దాజ్ తేజావత్, తెలుగు విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ రత్నశ్రీ సుధాకర్, సునామి సుధాకర్, భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ కేవీ రమణారావు, సంస్థ వ్యవస్థాపకురాలు వసుధ పాల్గొన్నారు.



కళాకారులతో దామోదర్‌గుప్తా తదితరులు

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో కళాకారుల నాట్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బండి ప్రేరణకుమార్ శిష్యబృందంచే నిర్వహించిన ఆంధ్రనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. ప్రార్థనగీతం, కుంభహారతి, పుష్పాంజలి, అలరిపు, వినాయకకౌతం, శివకై వారం, మూషికవాహన, సంధ్యాసమయం, దశావతారం, నవపారిజాతం తదితర అంశాలను కళాకారులు భావన, భవానీ, భవ్య, ఉజ్వల, మోక్షసారి, ప్రగతి, కేతన, బిందుప్రియ, సునీత, శ్రీజ, ధరణి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



కార్పొరేటర్ సుజాతనాయక్‌ను సత్కరిస్తున్న వందనపురికాలనీ వాసులు

హస్తినాపురం: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌళిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వందనపురి కాలనీలో ఇంజినీరింగ్, శానిటేషన్, జీహెచ్‌ఎంసీ , విద్యుత్ అధికారులతో కలిసి కార్పొరేటర్ సుజాతనాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాలనీలో అంతర్గత రహదారులు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయని, ఆగుంతలలో వర్షపు నీరు నిల్వఉండడంతో దోమల సమస్య పెరిగిందని వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో అంతర్గత రహదారులతో పాటు కాలనీలోని ప్రధాన రహదారి 50 అడుగులు నిర్మించేందుకు 5.5 కోట్లు మంజూరు అయ్యాయని, స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మాణం అయిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. అదే విధంగా కాలనీలోని భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, పార్కులో ఓపెన్ జిమ్ ఏరాపటు చేయడానికి కృషి చేస్తానని , కాలనీలో తక్షణమే అవసరమైన వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సుజాతనాయక్ అధికారులను ఆదేశించారు. ఈపనులన్నీ రెండు నెలలో పనులన్నీ పూర్తి చేస్తామని కాలనీ వాసులకు కార్పొరేటర్ భరోస ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కర్నాటీ చండీశ్వర్, గుర్రం చంద్రశేఖర్, నరసింహ్మా, సతీష్‌గౌడ్, పంత్యానాయక్, చల్లావేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మారెడ్డి, స్వామిరావు, విజయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయులను గౌరవించడం మన బాధ్యత’



ఉపాధ్యాయులను గౌరవించి సన్మానం చేసిన శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా

మన్సూరాబాద్: ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మన అందరి బాధ్యతని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి అన్నారు. వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లో ఆదివారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి నేటి పోటీ ప్రపంచంలో రాణించే విధంగా విద్యాబోధన చేయడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యంగా ఉండాలన్నారు. బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. సుమారు 80మంది ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాచం సుష్మ, నంగునూరి రమేష్, సాయి, కొత్త రవి, శ్రీపివాస్, దయాకర్, సత్యనారాయణ, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం..

- ప్రబలుతున్న వ్యాధులు
- భయాందోళనలో స్థానికులు

దిల్‌సుఖ్‌నగర్: అంతటా వ్యాధులు విజృంబిస్తున్నాయి. వైరల్‌ఫీవర్, డెంగీ వ్యాధులతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.బస్తీలు, కాలనీలలో పిల్లలు, పెద్దలు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. అస్తవ్యస్తంగా పారిశుధ్యం ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. జ్వరాలు పెరుగుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఒక పక్క వ్యాధులు విజృంభిస్తుంటే..మరో వైపు అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను విస్తరించకపోవడం వల్ల ఈ పరిస్థితులు తలెత్తాయి. ఇళ్ల ముందే డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండటంతో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వందల సంఖ్యలో చికిత్స పొందుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సరూర్‌నగర్, మలక్‌పేట్, సంతోష్‌నగర్ సర్కిళ్ల శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యానికి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా, అధికారులలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాల మీదకు తెస్తున్న నిర్లక్ష్యం

ఆర్‌కేపురం, సైదాబాద్, ఓల్డ్‌మలక్‌పేట్, మూసారాంబాగ్, సరూర్‌నగర్ డివిజన్‌ల మురికివాడల్లో నివసిస్తున్న వారికి వ్యాధులపై అవగాహన లేక విష జ్వరాల బారిన పడి తమ ఇళ్ళలో మగ్గి ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి జ్వరమే అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే పెద్ద ముప్పుగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫాగింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలనీలలో ఫాగింగ్ చేయకపోయినా చేసినట్లుగా రికార్డులను సృష్టించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

శానిటరీ అధికారుల తప్పిదమే ప్రధాన కారణం..

పారిశుధ్యంపై స్థానికులకు శ్రద్ధ లేకపోవడం ఇందుకు ప్రధానకారణం. కురిసిన వర్షాల కారణంగా ఈ ప్రాంతాల్లో నీరు నిల్వ చేరడం, పేరుకుపోతున్న చెత్త వర్షపు నీటిలో నాని దుర్వాసనలు వెదజల్లడంతోపాటు స్థానిక ప్రజల దైనందిన చర్యలు కూడా ఈ పరిసరాల్లో జరగడంతో పారిశుధ్య విషయంలో తీవ్రమైన సవుస్యలు ఉత్పన్నవువుతున్నాయి. వురికి నీరు చెత్తపై వాలిన దోవులు గుడిసెల్లో పాగా వేసి వారి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి.

అవులుకాని అధికారుల ఆదేశాలు..

జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలో పారిశుధ్యంపై తీసుకుంటున్న పలు చర్యలు మెరుగ్గా ఉంటున్నప్పటికీ బస్తీల ప్రాంతంలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. అప్పుడప్పుడు వచ్చిపోయే నాయకులు, అధికారులు ఇక్కడి పరిస్థితులను పర్యవేక్షించి ఆదేశాలు జారీ చేసి పోవడం తప్ప ఇతర చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వాంబే కాలనీలోని అపార్టుమెంట్స్ మధ్య పేరుకు పోయిన చెత్తాచెదారం